ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

ఆదివారం 6 ఏప్రిల్ 2025

నేలకొరిగిన పంటలు



సన్నాపురం క్యాంపు వద్ద నేలకొరిగిన వరి పంట

బళ్లారి జిల్లాలో రైతును ముంచేసిన అకాల వర్షాలు

8



రా రండోయ్.. ములోరి పెళ్లికి..

- సీతారామ కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమికి రాష్ట్రమంతటా సిద్ధమైంది. సీతారాముల కల్యాణానికి పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఆంజనేయుడి జన్మస్థలంగా పేరొందిన కొప్పళ జిల్లా అంజనాద్రి కొండపై ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉట్ల పరుషతోపాటు సీతారాముల విగ్రహాల ఊరేగింపులు, ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. ప్రతిచోటా పెసరపప్పు, పానకం, మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో ప్రసిద్ధి చెందిన గాలి ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



పంట పండేనా..?

- రెండో పంటపై రైతుల్లో ఆందోళన
- జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు
- కాల్వల నిర్మాణం, మరమ్మతులపై నిర్లక్ష్యం
- వద్దన్నా వేశారు: మంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దాదాపు మూడు వారాలకుపైగా భానుడు మండుతున్నాడు. ఇటీవల అడపాదడపా వర్షం కురిసినా కేవలం ఉపశమనంగా మాత్రమే మారింది. పలు చోట్ల వడగండ్లతో కొంతమేర పంటలకు నష్టం వాటిల్లింది. అయితే రాష్ట్రంలోని ప్రధాన నదులైన కావేరి, కృష్ణ నదులకు అనుబంధమైన ప్రధాన జలాశయాలలో క్రమేపీ నీటిమట్టం తగ్గుతుండడంతో దాహార్తి తీర్చేందుకు ఢోకా లేదంటున్నా రెండోపంటలకు తగినంత నీరు అందించడం కష్టమేనని అధికారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి విత్తనలక్ష్యం 6.54 లక్షల హెక్టార్లు ఉండగా సగటున 10శాతం కంటే తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి నాటికి 1.34 లక్షల హెక్టార్లలో విత్తనపనులు జరగ్గా ఈసారి 0.45 లక్షల హెకార్లు మాత్రమే సాధ్యమయ్యింది. గత ఐదేళ్లతో సరాసరి పోల్చితే 2.42 లక్షల హెక్టార్లు ఉంది అయితే ఈసారి సగటుకంటే తక్కువగా ఉంది.

ముందే చెప్పా..



రెండోపంట వద్దన్నప్పటికీ పలువురు రైతులు నాట్లు వేశారని జలవనరులశాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. రాయచూరు, కొప్పళ, యాదగిరి జిల్లాల రైతులు కాలువలకు కృష్ణా నది నీరు వదలాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. నీటి కొరత కారణంగా సాయం చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఈ అంశంపై అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణా ఆయకట్టులో మరిన్ని కష్టాలు..

కావేరి పరీవాహక ప్రాంతం కంటే కృష్ణానది ఆయకట్టు ప్రాంతం కాస్త భిన్నంగా ఉంది. పండించిన పంటలు, పెట్టుబడి మొత్తం చేతికి అందుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. నీటికోసం బెంగళూరుకు వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. తుంగభద్ర ఆనకట్టలో గత ఏడాది క్రస్ట్‌గేట్ కొట్టుకుపోగా తాత్కాలిక సాఫ్ట్‌లాక్ అమర్చడంలో సఫలీకృతులయ్యారు. ఈ సందర్భంగా రెండోపంటకు నీరు గ్యారెంటీ సాధ్యమని జలవనరులశాఖను నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్థానిక ప్రాజెక్టు రైతులకు అభయమిచ్చారు. అయితే ఆల్మట్టి, నారాయణపుర (బసవసాగర), తుంగభద్ర జలాశయాల్లో నీటి నిర్వహణ పరిస్థితి నేపథ్యంలో డీసీఎం ఇచ్చిన భరోసా అమలయ్యేది సవాల్‌గా మారింది. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో జోరు వర్షాలు కురవడంతో జలాశయాలు నిండుకుండల్లా తొణికిసలాడాయి. వేసవిలో పంటలకు, తాగునీటికి ఢోకా ఉండదన్న ప్రభుత్వం అంచనా వేయడంతో రైతులు సంబరపడ్డారు. అయితే డ్యాంలలో నీటి నిర్వహణ, సేకరణ, వాడకం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.



కేఆర్‌ఎస్ డ్యామ్ (ఫైల్)

ప్రముఖ జలాశయాల్లో నీటి సామర్థ్యం

డ్యాం పేరు	1.4.2025	1.4.2024
కేఆర్‌ఎస్	26.40	13.42
కబిని	11.71	9.39
హేమావతి	19.74	10.55
హారంగి	3.55	3.21
భద్ర	41.50	20.62
తుంగభద్ర	11.03	4.72
ఘటప్రభ	23.76	25.85
మలప్రభ	15.05	10.28
ఆల్మట్టి	33.03	38.96
నారాయణపుర	20.69	17.54
వాణివిలాససాగర	28.11	18.08
లింగనమక్కి	60.14	29.61
సూప	67.56	49.72
వారాహి	12.99	6.28

స్పందించని మహారాష్ట్ర

తుంగభద్ర డ్యాం కింద పండిస్తున్న పంటల సంరక్షణకు 4 టీఎంసీలు, నారాయణపుర డ్యాం కింద పండిస్తున్న పంటలు దక్కాలంటే 6.60 టీఎంసీల నీరు అవసరం ఉంది. తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో భద్రా జలాశయం నుంచి 2 టీఎంసీలు పొందదలిచారు. సీఎం సిద్దరామయ్య సూచన మేరకు ఆ నీటిని విడుదలచేశారు. అయితే ఆల్మట్టి, నారాయణపుర డ్యాంల్లో నీటి కొరత కారణంగా పొరుగున ఉండే మహారాష్ట్రలోని కోయ్నా జలాశయం నుంచి పొందదలిచారు. ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వానికి సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. రెండు టీఎంసీల నీరు విడుదల చేయాలని కోరారు. అయితే సానుకూలంగా స్పందించకపోవడంతో తాగునీటికి, పంటకు సమస్యగా మారింది.

నీటి లీకేజీ, దుర్వినియోగంపై అనుమానం

తుంగభద్ర, ఆల్మట్టి, నారాయణపుర డ్యాంలలో నీటి నిల్వలు తగ్గడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. లీకేజీ లేదా దుర్వినియోగం అయ్యిందా అనే సంశయం ఉంది. 2024 నవంబరు నాటికి ఆల్మట్టిలో 113.92, నారాయణపురలో 28.28, తుంగభద్ర డ్యాంలో 93.57 టీఎంసీల నీరు ఉండేది. 2025 జనవరి నాటికి ఆల్మట్టిలో 72.56, నారాయణపురలో 29.23, తుంగభద్రలో 53.46 టీఎంసీల నీరు ఉంది. రెండు నెలల్లో నీరు భారీగా తగ్గడంతో నీటి నిర్వహణలో జలవనరులశాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గ సబ్ కమిటీ సమావేశంలో గణాంకాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. డ్యాంలకు అనుబంధంగా ఉన్న జిల్లాల్లో తాగునీరు విడుదల, ఎండల కారణంగా ఎంతమేర ఆవిరి అయ్యిందనే లెక్కలు వేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పంట పండించేదుకే కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.



జగ్జీవన్‌రామ్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశస్వాతంత్ర్యం కోసం పోరాటంతోపాటు ఉపప్రధానిగా అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కల్పించేందుకు జీవితకాలం పాటుపడిన జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని సీఎం సిద్ధరామయ్య కొనియాడారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం విధానసౌధ తూర్పుద్వారం వద్ద జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని జరిపారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సీఎం సిద్ధరామయ్య నివాళులు అర్పించారు. అనంతరం సమాజశ్రేయస్సుకోసం పాటుపడిన వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, మునియప్ప, పరమేశ్వర్‌తోపాటు చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, పరిషత్ ప్రతిపక్ష నేత ఛలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విధానసౌధ బ్యాంకెట్‌హాల్ సుందరీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడ్డామని, వ్యతిరేకించేవారు ఎవరూ లేరన్నారు. సబ్‌ప్లాన్ అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి కాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయన్నారు.

కొవిడ్ అక్రమాలపై నివేదిక

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొవిడ్ వేళ పలు విధాల అక్రమాలు జరిగాయనే ఆరోపణల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అప్పగించారు. శనివారం కావేరిభవన్‌లో దర్యాప్తు కమిషన్ చైర్మన్ మాజీ న్యాయమూర్తి జాన్ మైఖేల్ డి కున్హా నివేదికను సీఎంకు అందించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ ఉన్నారు.



సీఎంకు నివేదిక అందజేస్తున్న కమిషన్ చైర్మన్



మీడియాతో కేంద్రమంత్రి కుమారస్వామి

ప్రభుత్వంపై ఇక పోరాటమే..!

- అనవసరంగా రెచ్చగొట్టకండి
- ప్రశ్నిస్తే భూకబ్జా ఆరోపణలు చేస్తారా
- కేంద్రమంత్రి కుమారస్వామి ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వంపై ఇక పోరాటమేనని, నన్ను అనవసరంగా రెచ్చగొట్టరాదని కేంద్ర మంత్రి కుమారస్వామి నేరుగా డీసీఎం డీకే శివకుమార్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రారంభించానని సవాల్ చేశారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. బీబీఎంపీ చెత్త టెండర్లలో ఎవరు ఎలా వ్యవహరించారో తెలుసునన్నారు. విధానసౌధలోని మూడో అంతస్తులో గజిని మహ్మద్, గోరీ మహ్మద్, మల్లిక్ కఫూర్‌లు పాలన జరుపుతున్నారంటూ వ్యంగ్యం చేశారు. కాంగ్రెస్ నాయకుల అక్రమాలపై టన్నులకొద్దీ ఆధారాలు ఉన్నాయన్నారు. కనకపురలో మాత్రమే 'బండే' కావచ్చునన్నారు. బళ్లారికి, తనకు ఏ సంబంధమని, అక్కడి అక్రమాలకు అంటగడతారా..? అంటూ ప్రశ్నించారు. 2003-04లో ఎస్ఎం కృష్ణ ప్రభుత్వంలో మట్టి పేరుతో వేలాది టన్నుల మునిఖనిజాన్ని బళ్కారి నుంచి ఎవరు ఎగుమతి చేశారని ప్రశ్నించారు. రాజకీయంగా నాపై దాడి చేయాలనుకుంటే సత్తా చూపిస్తానన్నారు. తాను యువకుడిగా ఉన్నప్పుడు విల్సన్‌గార్డెన్‌తోపాటు రెండు చోట్ల చెత్త సేకరణ ఏజెన్సీ తీసుకున్నానని, ఆ తర్వాత తన తండ్రి వద్దన్నందుకు వదిలేశానన్నారు. బీబీఎంపీలో కోట్లాదిరూపాయలు లూటీ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. టన్ను చెత్త సేకరణకు రూ.6,500తో చెన్నైకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఇవ్వదలిచారని, ఇందులో రూ. 15వేల కోట్లు లూటీ చేశారన్నారు. టన్ను చెత్త సేకరించేందుకు రూ.6,500 అంటూ ప్రశ్నించినందుకు రూ.3వేలకు తగ్గించారన్నారు. ఇదంతా ఎవరి కుట్రో తెలుసునన్నారు. మాజీ ప్రధాని కుమారుడినని, మాజీ ముఖ్యమంత్రినని 4 ఎకరాల భూమి కబ్జా చేయాలా..? అంటూ సవాల్ విసిరారు. 40ఏళ్ల క్రిందట భూమి కొన్నానని, ఇప్పుడు ఎందుకు తెరపైకి తెచ్చారో తెలియదన్నారు. కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ వెనుక ఆలోచన ఏంటని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేల పేర్లు చేర్చాల్సిందే..

- వినయ్ సోమయ్య ఆత్మహత్యపై బీజేపీ నిరసన
- ఎఫ్ఐఆర్‌లో కాంగ్రెస్ నేతల పేర్లు చేర్చాలని డిమాండ్
- కుశాలనగర్ పోలీస్ స్టేషన్ ముట్టడి..కీలక నేతల అరెస్ట్
- మీరు చెప్పేవన్నీ నిజాలేనా : సీఎం మండిపాటు



కుశాల్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన బీజేపీ నాయకులు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొడగు జిల్లా కుశాలనగర బీజేపీ కార్యకర్త వినయ్ సోమయ్య ఆత్మహత్యకు ముందు సోషల్‌మీడియాలో రాసుకున్న విధంగా ఎమ్మెల్యేల వేధింపులు ఉన్నాయని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం కుశాలనగర్ పోలీస్ స్టేషన్ ముందు బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రతోపాటు ఎంపీ యదువీర్, మాజీ మంత్రి బోపయ్య, ఎమ్మెల్సీ రవికుమార్, శ్రీవత్సతోపాటు పలువురు ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేలు పొన్నణ్ణ, మంతర్‌గౌడలపై ఎఫ్ఐఆర్‌కు మధ్యాహ్నం దాకా వేచి ఉంటామని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని విజయేంద్ర సవాల్ విసిరారు. తుగ్లక్ పాలన సాగిస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుంటే అంత్యక్రియలు జరిపేది లేదన్నారు. ఆసుపత్రిలో శౌచాలయాలు బాలేదంటే మరమ్మత్తులు చేయించాలిగానీ ఇలా ప్రాణాలా తీసేలా వేధిస్తారా..? అంటూ మండిపడ్డారు. ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో వారందరినీ అరెస్టు చేశారు.

ఎమ్మెల్యేల పేరు చేర్చేది లేదు : సీఎం

కాగా సీఎం సిద్దరామయ్య విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకులు ప్రతీదీ రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. వారు చేప్పేవన్నీ నిజాలంటే ఎలా అన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఎమ్మెల్యేలు చేర్చేది లేదని సీఎం తేల్చి చెప్పారు. బీజేపీ డిమాండ్లకు అనుగుణంగా కేసులు పెట్టలేమన్నారు.



విజయేంద్రను తరలిస్తున్న పోలీసులు

వైభవంగా శాంతలింగేశ్వరుడి రథోత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా అళంద తాలూకా కడగంచి గ్రామంలో శాంతలింగేశ్వర స్వామి 395వ జాతర సందర్భంగా మహారథోత్సవం వైభవంగా జరిగింది. శాంతలింగేశ్వర మఠం పీఠాధిపతి వీరభద్ర శివాచార్య నేతృత్వంలో అలంకరించిన రథానికి వివిధ ధార్మిక పూజలు చేశారు. 20కుపైగా కళాబృందాలు పాల్గొని సందడి చేశాయి. అనంతరం శాంతలింగేశ్వర ఆలయ ఆవరణలో భక్తుల జయ జయధ్వానాల నడుమ రథోత్సవం సాగింది. కడగంచి, లాడ చించోళి, నరోణా, గోళా, ధర్మవాడి తదితర చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. జాతరలో భాగంగా కలబురగి - అళం మెయిన్‌రోడ్డుకు అనుబంధంగా విశాలమైదానంలో పశువుల పరుష నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మారనున్న చదువు

● డిగ్రీలో కొత్త కోర్సులు...! ● ఉద్యోగ కల్పనే ధ్యేయం
● కంపెనీల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు
● కోర్సు చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్
● విధివిధానాలు రూపొందిస్తున్న విద్యాశాఖ



అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డిగ్రీలో స్కిల్ బేస్డ్ కోర్సుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థల ను గుర్తించి వాటికి అవసరమైనవిధంగా పాఠ్యాంశాలు రూపొందించేం దుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గుర్తించిన సంస్థలతో ముందుగానే ఒప్పందాన్ని కుదుర్చుకుని కళాశాలలకు అనుసంధానం చేయనుంది. ఆ మేరకు కోర్సు చివరి సంవత్సరంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయించి అదే సమయంలో నెలకు రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లించేలా సంబంధిత సంస్థ కళాశాలలతో ఎంఓయూ కుదుర్చుకోవాలి. ఇలా అనేక కోణాల్లో సానుకూల అంశాలను క్రోడీకరించి పకడ్బందీగా అమలు చేసేందుకు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించి ప్రణాళికలు రూపొందించింది. అందుకు అనుగుణంగా విద్యాశాఖ విధివిధానలను రూపొందిస్తోంది.

గతమంతా గందరగోళం

గడిచిన ఐదేళ్లు విద్యా వ్యవస్థలో గందరగోళాన్ని సృష్టించారు. డిగ్రీలోని మూడు సబ్జెక్టులకు బదులుగా ఒక సబ్జెక్టునే ప్రధానం చేసి, రెండో ప్రాధాన్యంగా మరో సబ్జెక్టును ఎంచుకోండంటూ విద్యార్థుల్లో అయోమ యాన్ని రేకెత్తించారు. హానర్ డిగ్రీ చేసిన విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యు యేట్(పీజీ)లో ప్రవేశం పొందేందుకు గైడ్‌లెన్స్ రూపొందించలేదు. మరోవైపు తరగతులు నిర్వహణ, అధ్యాపకుల అడ్జెస్ట్‌మెంట్, టైంటేబుల్ ఇలా ప్రతిది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించారు. వీధుల్లోని కిరాణా కొట్లు, రిపేరీ షాపులు, తోపుడు బండ్ల వ్యాపారాలను సైతం కంపెనీలుగా గుర్తించి వాటిలో ఇంటర్న్‌షిప్ చేయాలని విద్యార్థులకు లిస్ట్ ఇచ్చారు. వీటికి తోడు మూడు నెలలకు ఒక సెమిస్టర్ నిర్వహిస్తేనే ప్రపంచ దేశాలతో పోటీపడతామని కబుర్లు చెప్పారు. చివరికి ఏదీ ఫలితాన్ని ఇవ్వలేదని అధ్యాపక వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. గతంలో సృష్టించిన గందరగోళం నుంచి బయటపడటానికి నానాకష్టాలు పడాల్సి వస్తోందని వాపోతున్నాయి.

నైపుణ్యానికే జై...

నిర్వీర్యమైన ఉన్నత విద్యావ్యవస్థను నైపుణ్యంతో పునర్మించేలా రాష్ట్ర విద్యాశాఖ ముందుకెళ్తోంది. స్కిల్డ్ బేస్డ్ కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్య మెలకులు పెంపొందించేలా భవిష్యత్తును నిర్మి స్తోందని కళాశాలల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మానవాళికి అవసరమైన ప్రతి వినియోగ వస్తు తయారీ, ముడిసరుకు నుంచి వస్తు ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్, రీ-ప్రొడక్షన్ అన్ని ప్రక్రియలను సద్వినియోగం చేసుకునేందుకు వాటికి అవసరమైన నైపుణ్యాలను అందించేలా కొత్త కోర్సులు రూపొందుతున్నాయని వివరిస్తున్నాయి. కంపెనీలు, కళాశాలలను అనుసంధానం చేసి మార్కెట్, ఇండస్ట్రీయిల్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెడతారు. చివరి సంవత్సరంలో పరిశ్రమల్లోకి ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే విద్యార్థులకు ఉపకార వేతనం చెల్లిస్తారు. సంస్థను బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లిస్తారు. కచ్చితంగా ఆర్నెళ్లు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

అటానమస్, న్యాక్...?

కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కళాశాలలో ఉండాలి. అటానమస్ కళాశాలలా? న్యాక్ ఏ గ్రేడున్న కళాశాలలా? అన్ని కళాశాలలా? అన్న తర్జనభర్జన సాగుతోంది. కోర్సు ప్రవేశపెట్టిన తరువాత అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలి. ప్రాక్టికల్స్‌కు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేయాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలి. పరీక్షల నిర్వహణ, ఎవాల్యుయేషన్, మార్కుల గ్రేడింగ్ తదితర ప్రక్రియలు సమీక్షించుకోవాలి. సంపూర్ణస్థాయిలో వసతులు సమకూర్చుకున్న కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడితే సత్ఫలితాలు వస్తాయని అధ్యాపక వర్గాలు పేర్కొంటున్నాయి.

శుభ పరిణామం



ఉద్యోగ కల్పనే ధ్యేయంగా డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. పూర్వ వైభవం సాధించేలా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులకు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలనుకోవడం శుభ పరిణామం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంపూర్ణస్థాయి మౌలిక సదుపాయాలున్నాయి. 2014-18వరకు రూసా వంటి నిధులతో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అధునాత భవనాలు నిర్మించారు. తగిన అధ్యాపకులున్నారు. కొత్తకోర్సుల ప్రవేశానికి అన్నివిధాలా అనుకూలంగా ఉన్నాయి.

- రామకృష్ణ, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఏ దారైనా అంతే..!

నత్త నడకన ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణం

● ఏళ్ల తరబడి సాగుతున్న పనులు ● ప్రయాణికులకు తప్పని తిప్పలు ● భూసేకరణే అసలు సమస్య
● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూసేకరణలో అధికారుల అలసత్వంతోనే పనులు నిదానంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

భూసేకరణలో జాప్యంతో ముందుకు సాగని పనులు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయించారు. అయితే కొందరు అధికారుల అలసత్వం, పలు విభాగాల సమన్వయ లోపంతో భూ సేకరణలో జాప్యం జరుగుతోంది. అందుకే పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని ఉదాహరణలు

గోరంట్ల - హిందూపురం ఫోర్‌వే లేన్ 34 కిలోమీటర్ల నిర్మాణాన్ని రెండేళ్ల కిందట రూ.810 కోట్లతో ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు.

● తాడిపత్రి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.160 కోట్లతో రెండేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. పనులు నత్తనడక సాగుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు పూర్తి కావడానికి ఇంకెన్నేళ్లు పడుతుందోనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● ముదిగుబ్బ - పుట్టపర్తి రహదారి నిర్మాణం పనులు ఇప్పటి వరకూ 76 శాతం పూర్తి చేశారు. ముదిగుబ్బలో ఆర్వోబీ పనులు ప్రారంభిం చాల్సి ఉంది. ఇదే అసలైన సమస్యగా అధికారులు చెబుతున్నారు.

● రాప్తాడు ఆర్వోబీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి. ఏడెనిమిదేళ్లు గడిచినా ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. 1.6 కి.మీ రోడ్డును రూ.98.55 కోట్లతో చేపట్టారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తి చేయడానికి ముందుకు రాలేదు. దీంతో టెండర్ రద్దు చేసి, నూతన టెండర్ పిలవనున్నారు. ఎప్పటికి పూర్తి చేస్తారన్నది తెలియాల్సి ఉంది.

● బత్తలపల్లి - ముదిగుబ్బ ఫోర్‌వే లైన్ నిర్మాణంలో భాగంగా అతి కష్టం మీద పనులు పూర్తి చేశారు. రాకపోకలకు అవకాశం కల్పించడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన పనులు

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు జాతీయ రహదారుల నిర్మాణానికి కావల్సిన నిధులు కేటాయించింది. నిధుల కేటాయింపు జరిగి కొన్నేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపు లేకపోవడం కూడా పనుల జాప్యానికి కారణంగా చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో పనులు పెండింగ్ పడిపోయాయి. ఎన్నికల తరువాత కూడ దాదాపు 3 నెలలు పాటు అదే తరహాలో జరిగిందన్న ప్రచారం ఉంది.



రాప్తాడు రైల్వే బ్రిడ్జి దుస్థితి..



ఎక్కడి నుంచి ఎక్కడికి	దూరం (కి.మీ.)	నిధులు	పనుల పూర్తి శాతం
ముదిగుబ్బ - పుట్టపర్తి	32	రూ.402 కోట్లు	76
పులివెందుల - బి. కొత్తపల్లి	57	రూ.840 కోట్లు	62
పుట్టపర్తి - కోడూరు	47	రూ.1319 కోట్లు	50
తాడిపత్రి బైపాస్ రోడ్డు	38	రూ. 160 కోట్లు	65

ఉమ్మడి జిల్లాలో పనులను పరిశీలిస్తే..

వేగవంతం చేస్తాం: సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ



కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలో జాప్యంతో పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా చర్యలు తీసుకుని, పనులు వేగవంతం చేస్తాం. భూ సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. పనులు మరింత వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.

● యూడీఐడీ కార్డుతో సేవలు సులభతరం
● దివ్యాంగులకు వరం యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు
● ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
● 21 రకాల సేవలు పొందే అవకాశం

సదరం సమస్యలకు చెక్..!





యూడీఐడీ కార్డు ముందు భాగం... యూడీఐడీ కార్డు వెనుక భాగం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలకు సదరం స్థానంలో యూడీఐడీ(యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని ప్రవేశపెట్టారు. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లను జారీ చేసేవారు. ఈ బాధల నుంచి దివ్యాంగులకు విముక్తి కల్పించేందుకు కేంద్రప్రభుత్వం యూడీఐడీ కార్డు అమలుకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో యూడీఐడీని పొందేందుకు http://swavlambancard.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటి వద్ద నుంచే ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాల నుంచి కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించింది.

మూడు లక్షల మందికి ప్రయోజనం

యూడీఐడీ కార్డు ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతల్లో 30 వేల మందికి ఈ యూడీఐడీ కార్డులను అందజేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి కార్డు ప్రయోజనాలు వివరిస్తున్నామన్నారు. సదరం శిబిరాల కోసం మీ-సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు ఎప్పుడు హాజరుకావాలనే సమాచారం ఫోన్ నెంబర్‌కు మెసేజ్‌లు వస్తాయి. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎలాంటి తప్పులు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఐదు రకాల వైకల్యం ఉన్న వారికే మీ-సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. సదరం శిబిరంలో వైకల్యం నిర్ధారణ అయిన అనంతరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డు రూపంలో పోస్టల్‌శాఖ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇళ్ల చిరునామాకు పంపుతారు. ఈ కార్డు ద్వారా పింఛన్లతో పాటు పలు సంక్షేమ ప్రయోజనాలు దేశవ్యాప్తంగా పొందే అవకాశం ఉంది. ఈ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

దరఖాస్తు ఇలా...

గూగుల్‌లో http://swavlambancard.gov.in పోర్టల్ ఓపెన్ చేయగానే... అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియలో సూచించిన అంశాలను పరిశీలించాలి. తరువాత దివ్యాంగుడు తన వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. రెండో కాలమ్‌లో చిరునామా, గుర్తింపు కార్డు వివరాలు, శాశ్వత చిరునామా పొందుపరచాల్సి ఉంటుంది. మూడో కాలమ్‌లో వైకల్య వివరాలు, నాలుగో కాలమ్‌లో ఎంప్లాయిమెంట్, దివ్యాంగుని గుర్తింపు వివరాలు నమోదు చేయాలి. ఫొటో, వేలిముద్ర లేక సంతకం చేసి అప్‌లోడ్ చేసి సబ్‌మీట్ చేయడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకొనే అవకాశం ఉంటుంది.

యూడీఐడీ తప్పనిసరి



దివ్యాంగులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి కానుంది. దివ్యాంగులకు ఇప్పటి వరకూ సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఆ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డుల జారీకి ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరించింది. ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీని ప్రవేశపెట్టింది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఈ కార్డు పొందితే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు.

- వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ



గంజాయి పత్రి..!

తాడిపత్రిలో ఐదురోజుల క్రితం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి మత్తులో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులపైనే బూతు పురాణం అందుకున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా పోలీసు స్టేషన్‌పైనే రాళ్లు రువ్వాడు గంజాయి మత్తులో ఓ యువకుడు. అక్కడే నిలబడి పోలీసులను దుర్భాషలాడుతున్నా.. వారు చోద్యం చూశారే తప్ప.. చర్యలు తీసుకోలేదు. మద్యం మత్తులో ఉన్నాడంటూ చెప్పుకొచ్చారు. పోలీసు స్టేషన్‌పైనే రాళ్ల దాడి చేస్తున్నా.. అడ్డుకునే వారు లేకపోతే.. పట్టణంలో ప్రజలపై రక్షణ ఎవరు కల్పిస్తారని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాపురం జీరో రోడ్డులో మూడునెలల క్రితం కళాశాల విద్యార్థినిని గంజాయి బ్యాచ్ కామెంట్ చేస్తుండగా.. అక్కడే ఉన్న ముగ్గురుబేల్దార్లు మందలించారు. వారిపై కూడా గంజాయి బ్యాచ్ రాళ్లతో దాడులు చేసింది. తీవ్రంగా గాయపడిన బేల్దార్లు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. నిరుపేదలైన ఆ కుటుంబీకులు వైద్యానికి లక్షల రూపాయలు వెచ్చించలేక దిక్కులు చూస్తున్నారు. ప్రస్తుతం పనిచేయడం చేతకాక, వైద్యఖర్చుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

భగత్‌సింగ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో గంజాయి బ్యాచ్‌కు సంబంధించిన వీడియో వైరల్ అయింది. వారిని ఇంత వరకు అరెస్టు చేసిన పాపానపోలేదు. పట్టణంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బయటకు వెళ్లాలంటే భయం..

పట్టణంలో ఇటీవలిగా విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని వీధుల్లో రాత్రిపూట గంజాయి బ్యాచ్‌లు ద్విచక్రవాహనాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం కృష్ణాపురం 6వ రోడ్డులో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేయడంపై ఒక వ్యక్తి.. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో అతడి ఇంటిపైకి వెళ్లి గంజాయి బ్యాచ్ దాడి చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకటికాదు.. రెండు కాదు.. చెప్పుకుంటూ పోతే చాలాచోట్ల దాడులకు తెగబడుతున్నారు. వారిని దండిస్తే ఎక్కడ తమ మీదకు వస్తారోనని భయపడి అందరూ తమ దారిన తాము వెళ్లిపోతున్నారు. గంజాయి బ్యాచ్‌ల ఆకృత్యాలతో రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని కొందరు చర్చించుకుంటున్నారు. విద్యార్థినులను కళాశాలలకు పంపించాలంటే కొందరు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కళాశాల వద్దకు వెళ్లి పిల్లలను విడిచిపెట్టే వచ్చే పరిస్థితి ఏర్పడింది. కళాశాల ప్రారంభం, విరామం, మధ్యాహ్న భోజనం, వదిలే సమయాల్లో ఈ బ్యాచ్‌లు ఆయా ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో కొందరు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలువురు కళాశాలల నిర్వాహకులు.. పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతున్నాయి. ఇలా అయితే ఎలా అంటూ కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యల్లనూరు రోడ్డు, కృష్ణాపురం జీరో రోడ్డు,

మహమ్మారి మత్తులో యువకుల హల్‌చల్

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవలిగా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. యువత మహమ్మారి మత్తులో జోగుతున్నారు. బ్యాచ్‌లుగా ఏర్పడి గంజాయి సేవిస్తూ.. ఆ మత్తులో దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు చేస్తున్నారు. బాలికలు, విద్యార్థినులు, మహిళలను వేధిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. బిడ్డలను పాఠశాలలు, కళాశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారే నేరుగా వెళ్లి, వదిలి రావాల్సి వస్తోంది. నందలపాడు, టైలర్స్‌కాలనీ, భగత్‌సింగ్ నగర్, కూరగాయల మార్కెట్, నంద్యాల రోడ్డు, పాతకోట, సుంకులమ్మపాలెం, విజయనగర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఏటిగడ్డపాలెం, ఆటోనగర్, టీచర్స్ కాలనీ, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు తదితర చోట్ల గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. అయినా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు
● బాలికలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన
● రోడ్లపై ప్రమాదకరమైన బైక్ స్టంట్లు
● బెంబేలెత్తుతున్న ప్రజలు
● పట్టించుకోని పోలీసులు



తాడిపత్రి పట్టణ పోలీసు స్టేషన్

బెంబేలెత్తిస్తున్న బైక్ స్టంట్లు

పట్టణంలోని యల్లనూరు, సీబీ రోడ్డు, పుట్లూరు రోడ్డు, నంద్యాల రోడ్డు ప్రాంతాల్లో యువకులు బైక్ స్టంట్లు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తున్నారు. ఇప్పటికే పలువురు బైక్ స్టంట్లు చేస్తూ కిందపడి గాయాలపాలయ్యారు. ఎవరైనా పోలీసులకు సమాచారమిస్తే.. వారు వచ్చే సమయానికి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. మరలా గంట తర్వాత వచ్చేసి యథేచ్ఛగా స్టంట్లు కొనసాగిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు హద్దేలేకుండా పోతోంది.

పుట్లూరు రోడ్డు ప్రాంతాల్లో కళాశాలలు ఎక్కువగా ఉండడంతో ఆయా చోట్ల నిత్యం గంజాయి బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. గంజాయితోపాటు తెల్లగా పౌడర్ రూపంలో ఉన్న మత్తుపదార్థాన్ని సైతం యువకులు పీల్చుతున్నారు. ఇప్పటికైనా వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం



గంజాయి విక్రయాల విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై ఇప్పటికే ప్రత్యేక నిఘా పెట్టాం. ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి, ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారనే వాటిపై దృష్టి పెట్టాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

వక్ఫ్ బిల్లుపై వైసీపీ ద్వంద్వ వైఖరి వీడాలి

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై వైసీపీ నాయకులు ద్వంద్వ వైఖరిని వీడాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ డిమాండ్ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో వైసీపీ మత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో మరోలా వైసీపీ ఎంపీలు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల వక్ఫ్ భూములను అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. దేశంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. సీఎం చంద్ర బాబు, మంత్రి నారాలోకేశ్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో బాబాఫక్రుద్దీన్, మహ్మద్‌రఫీ, మౌలా, జాఫర్, షెక్షావలి, మహబూబ్ బాషా, హాజీవలి, మాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శ్రీరామనవమి




పురాణాల ప్రకారం త్రేతా యుగంలో శ్రీరాముడు వసంత రుతువులో చైత్రశుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రం కర్కాటకలగ్నంలో అభిజిత్ ముహూర్తంలో జన్మించారు. పురాణ పురుషుడి జన్మదినాన్ని ప్రజలు పండుగలా ఆచరిస్తారు. తండ్రిమాటకు కట్టుబడి 14 సంవత్సరములు అరణ్యవాసము, రావణసంహారం అనంతరం సీతా సమేతంగా శ్రీరాముడు అయోధ్యలో పట్టాభిషిక్తులైన సందర్భం కూడా చైత్రశుద్ధ నవమి రోజే జరిగిందని ప్రజల విశ్వాసము. ఆయన పాలన రామరాజ్యంగా పేరొందింది. ఈరోజున విశేషంగా ఉత్సవాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

రాఫెల్ (జయంతి, వర్ధంతి)



ఇటలీ దేశ ప్రఖ్యాత చిత్రకారుడు, శిల్పి రాఫెల్లో సాంజియో డా అర్బినో 1483 ఏప్రిల్ 6న జన్మించారు. ఇటలీ దేశ చిత్ర కళలో తనదైన ముద్రను చాటారు. మిఛెలాంజెలో, లియనార్డో డా విన్సివంటి ప్రముఖులతో కలసి గొప్పచిత్రాలు రూపొందించారు. ఆయన గీసిన చిత్రాలు వాటికన్ ప్యాలెస్‌లో ప్రదర్శించబడ్డాయి. వాటికన్‌లోని 'ది స్కూల్ ఆఫ్ ఏథెన్స్', స్టాంజా డెల్లా సెగ్నేచురా వంటివి ప్రాచుర్యం పొందాయి. 37వ యేట 1520 ఏప్రిల్ 6న కన్నుమూశారు. ఇలా జయంతి, వర్ధంతి ఒకేరోజు రావడం విచిత్రం.

మీనాక్షి సుందరం పిళ్ళై (జయంతి)



తమిళ సాహితీవేత్త మీనాక్షి సుందరం పిళ్ళై 1815 ఏప్రిల్ 6న జన్మించారు. సాహిత్యంపై ఎనలేని పరిశోధనలు చేసి గుర్తింపు తెచ్చారు. ప్రత్యేకించి శైవ ఆగమంపై విశేష సేవలందించారు. 90 స్థల పురాణాల గురించి, విభిన్న ఆలయాల గురించి రచనల ద్వారా వివరించారు. ఎంతోమంది శిష్యులకు సాహిత్యంపై అవగాహన కల్పించారు. 1876 ఫిబ్రవరి 1న కన్నుమూశారు.

సుచిత్రాసేన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సుచిత్రాసేన్ 1931 ఏప్రిల్ 6న బెంగాల్ ప్రెసిడెన్సీలోని పాబ్నా ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్) జన్మించారు. ఆమె అసలు పేరు రోమా దాస్ గుప్త. బెంగాలీ, హిందీ సినీ రంగంలో ఎంతో పేరొందారు. బెంగాల్‌లో 'మహానాయిక'గా గుర్తింపు పొందారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంచే 'బంగాబి భూషణ్' పురస్కారం అందుకున్నారు. 1955లో హిందీలో బిమల్‌రాయ్ రూపొందించిన 'దేవదాస్' సినిమాకు ఉత్తమ నటిగా నిలిచారు. అంతర్జాతీయ ఫిలింఫేర్ అందుకున్న తొలి భారతీయ నటి. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'సాత్ పాకే బంధ' ఎంపిక కావడంతో ఉత్తమ నటిగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2014 జనవరి 17న కన్నుమూశారు. కాగా ఆమె కుమార్తె మున్ మున్ సేన్, మనుమరాళ్లు కూడా సినీరంగంలో ఉన్నారు.

దిలీప్ వెంగ్‌సర్కార్ (పుట్టినరోజు)



మాజీ క్రికెటర్ దిలీప్ బల్వంత్ వెంగ్‌సర్కార్ 1956 ఏప్రిల్ 6న మహారాష్ట్రలోని రాజాపూర్‌లో జన్మించారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 70, 80 దశకాలలో సునీల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్‌లతో కలసి ఆడారు. 'కల్నల్' అని ముద్దుగా పిలవబడ్డారు. బాంబేలో రంజీ ట్రోఫీలకు ప్రాతినిత్యం వహించారు. టెస్టు మ్యాచులలో వరుసగా మూడుసార్లు సెంచరీలు చేసి గుర్తింపు పొందారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సుదీర్ఘకాలం కొనసాగారు. పద్మశ్రీ, అర్జున పురస్కారాలు అందుకున్నారు. మూడు క్రికెట్ అకాడమీల ద్వారా ఎంపిక చేసిన క్రీడాకారులకు ప్రతిభ ఆధారంగా వివిధ దశలలో ఉచిత తర్ఫీదు ఇస్తున్నారు.

నర్సింగ్ కాలేజీలో జర్మన్, జపాన్ భాషలు

» వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులు విదేశాలలోనూ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించదలిచామని అందుకే జపాన్, జర్మన్ భాషలను పరిచయం చేయాలని నిర్ణయించామని వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ తెలిపారు. ఎఫ్‌కేసీసీఐ ఉద్యోగ ఉత్సవ్‌ను శనివారం ప్రారంభించిన మంత్రి సభలో మాట్లాడారు. ఇటీవల జర్మన్, జపాన్, ఇటలీ దేశాలలో నర్సు, పారామెడికల్ వంటి వైద్యనిపుణులకు డిమాండ్ పెరిగిందన్నారు. అందుకే నర్సింగ్ కళాశాలలో వివిధ దేశాలభాషలను పరిచయం చేయదలిచామన్నారు. ఇటీవల బెంగళూరులో ఉద్యోగమేళాకు 80వేలమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని 45వేలమంది పాల్గొనగా 9654మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. 16865మంది షార్ట్‌లిస్ట్‌లో ఉన్నారన్నారు. ఈనెల 16న కలబురగిలో ఉద్యోగమేళా ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్‌కేసీసీఐ చొరవను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎఫ్‌కేసీసీఐ నైపుణ్యాభివృద్ధి సమితి అధ్యక్షుడు అభిషేక్ మాట్లాడుతూ ఉద్యోగ ఉత్సవ్‌లో 120 కంపెనీలు పాల్గొన్నాయని, ఇందులో 55 కంపెనీలు ఎఫ్‌కేసీసీఐలో సభ్యత్వం ఉన్నాయన్నారు. 5వేల మంది ఉద్యోగాలకోసం వచ్చారన్నారు. కర్ణాటక స్టేట్ డెంటల్ కౌన్సిల్ ఎండీ నాగరాజ్, ఎఫ్‌కేసీసీఐ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఉమారెడ్డి, ఉపాధ్యక్షుడు సాయిరాం ప్రసాద్, మాజీ అధ్యక్షుడు రమేశ్‌చంద్ర లహోటి, సీఈఓ తేజస్ ఎన్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

బంగారపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అపారసేవలందించి మహాన్ నాయకులయ్యారని తహసీల్దార్ వెంకటేశప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయ సభాంగణంలో జాతీయ పండుగల ఆచరణ సమితి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం 118వ జయంతిలో భాగంగా చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అస్పృశ్యత నివారణకు, సమానత్వం కోసం పాటుపడ్డారన్నారు. కేంద్ర వ్యవసాయమంత్రిగా విప్లవం సాధించి రైతుల ఆర్థికస్వావలంబన దిశగా సాగేందుకు సాధ్యమైందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి అంజలిదేవి, తాలూకా పంచాయతి ఈఓ రవికుమార్, ఇంజనీర్ రవి, ఉద్యానవనాలశాఖ శివారెడ్డి, యువరాజ్, దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో....

ముళబాగిలు: సమాజంలో అస్పృశ్యత నివారణకు పాటుపడి సమానత్వం కోసం కృషి చేసిన బాబు జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకాపంచాయతీ సభాంగణంలో తాలూకా యంత్రాంగం, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్తంగా శనివారం ఏర్పాటైన జగ్జీవన్‌రాం 118వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపప్రధానిగా, వ్యవసాయ విప్లవం సాధించడమే కాక మూడు దశాబ్దాలపాటు వివిధశాఖల మంత్రిగా ఉత్తమ పాలన అందించారన్నారు. కాగా దళితులు ఐకమత్యంగా తమ హక్కులకోసం పోరాటం చేయాలన్నారు. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ అగ్ర, నిమ్న వర్గాల బేధభావాలు నివారణకు, వెట్టిచాకిరీ నిర్మూలనకు జగ్జీవన్‌రాం కృషి చేశారన్నారు. తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ కే సర్వేశ్, నరేగా సహాయక డైరెక్టర్ రవిచంద్ర, నగరసభ సభ్యుడు సోమణ్ణ, సాంఘిక సంక్షేమశాఖ అధికారి భవీన్, మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాం జయంతిలో తహసీల్దార్ తదితరులు



ముళబాగిలు తాలూకా కేంద్రంలో జగజ్జీవన్‌రాం జయంతి

పోలీస్‌స్టేషన్‌లో కులాంతర వివాహం



పోలీసుల సమక్షంలో కులాంతర వివాహం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ప్రేమికులకు కులాంతర వివాహం జరిపించారు. తాలూకాలోని దొడ్డదాసేనహళ్ళికి చెందిన కార్తీక్, శిడ్లఘట్ట పట్టణం ఉల్లూరుపేటకు చెందిన అంకితా ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలు అంగీకరించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఇరువురిని కౌన్సిలింగ్ జరిపాక పోలీస్‌స్టేషన్‌ను కల్యాణమండపంగా, పోలీసులు పురోహితులుగా మారి స్థానికుల సమక్షంలో సరళంగా వివాహం జరిపించారు. తొలుత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాస్ ఇరుకుటుంబాల పెద్దలతో చర్చలు జరిపారు. అయితే అంగీకరించకపోవడంతో ఇద్దరూ మేజర్‌లు కావడంతో పరస్పర అంగీకారంతో జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సీ దృష్టికి తెచ్చారు. ఎస్సై వేణుగోపాల్ సహకారంతో సంప్రదాయకంగా వివాహం జరిపించారు. దళిత సంఘాలు, కన్నడ సంఘాలు, రైతుసంఘాల సభ్యులు మద్దతు ఇచ్చారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దళితసంఘర్ష సమితి జిల్లా సంచాలకులు వెంకటేశ్, రామాంజి, భక్తరహళ్ళి ప్రతీశ్, చలపతి, రవిశంకర్, దాసణ్ణ నరేంద్ర, పోలీస్ కానిస్టేబుళ్ళు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ నిరసన



బంగారపేట ధర్నాలో బీజేపీ నాయకులు కార్యకర్తలు

బంగారపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక చేత్తో ఇస్తూ మరొకవైపు ధరలను పెంచి లాక్కుంటోందని ప్రజా వ్యతిరేక రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా విఫలమైందని బీజేపీ ఆరోపించింది. కోలారు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో చేరిన బీజేపీ కార్యకర్తలు రాష్ట్రప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నియోజకవర్గంలో పలువురు అధికారులు ఎమ్మెల్యేల చేతిలో కీలుబొమ్మగా ఉన్నారని, పాలకులు ఫోన్ చేస్తేనే పనులు చేస్తారని లేదంటే అంతే సంగతులు అన్నారు. నిరసనలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహేశ్, తాలూకా అధ్యక్షుడు సంపంగిరెడ్డి, మార్కండేగౌడ, హున్కుంద వెంకటేశ్, నాగేశ్, హొసరాయప్ప, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై నిరసన

ముళబాగిలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాంట్రాక్టు పనులలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ నిర్ణయం, నిత్యావసర ధరల పెంపు, బీజేపీ 18మంది ఎమ్మెల్యే సస్పెన్షన్‌ను ఖండిస్తూ తాలూకా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేఈబీ సర్కిల్‌లో పెద్దసంఖ్యలో చేరిన కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఖండించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేలను ఆరు నెలలపాటు సస్పెన్షన్ వేటు వేయడంతో ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాపర్తి అమర్, మైసూరు సురేశ్, రాష్ట్ర మామిడి అభివృద్ధ మండలి మాజీ అధ్యక్షుడు ఎంకే వాసుదేవ్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.



ముళబాగిలు కేఈబీ సర్కిల్‌లో బీజేపీ ధర్నా

విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకే ఆత్మత్రిష

» పీఈఎస్ వీసీ సూర్యప్రసాద్



ఆత్మత్రిష ప్రారంభంలో వీసీ సూర్యప్రసాద్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఉత్సాహం నింపేందుకు సంగీతాన్ని ఆస్వాదించేందుకోసమే ఏటా ఆత్మత్రిష పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పీఈఎస్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాత్రి సంగీత సందడిని లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ సంగీతగాయని, మ్యూజిక్ డైరెక్టర్ సీఆర్ బాబి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారని, విద్యతోపాటు ఆహ్లాదం, ఆలోచనలు ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అంకితా అమర్ మాట్లాడుతూ జస్ట్ మ్యారిడ్ సినిమా కథలను పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పీఈఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ దొరస్వామికి అంకితం చేస్తున్నామన్నారు. ప్రముఖ నటుడు, బిగ్‌బాస్ ఫేం శైన్‌శెట్టి పలు పాటలు పాడి అలరించారు. రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్, డీన్ డాక్టర్ వీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హొరగద్దె వీఎస్ఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా నటరాజ్



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా హొరగద్దె వ్యవసాయ సహకారసంఘం అధ్యక్షుడిగా నటరాజ్, ఉపాధ్యక్షులుగా సీత నాయకనహళ్ళి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీఎస్ఎస్ఎస్ఎన్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సంఘానికి ఎన్నికలు జరిగి మూడు నెలలైనా వివాదం కోర్టులో ఉండడంతో ఓట్ల లెక్కింపు జరగలేదు. ఇటీవల లెక్కింపు పూర్తి చేయగా కాంగ్రెస్ మద్దతుదారులు భారీ విజయం సాధించారు. శుక్రవారం సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. విజేతలను సభ్యులు, స్థానిక ప్రముఖులు ఘనంగా సత్కరించారు. బాణాసంచా కాల్చి విజయోత్సవం చేశారు. గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు గొల్లహళ్ళి వెంకటస్వామి, నాగరాజు, తాలూకా అధ్యక్షుడు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురసభ అధ్యక్షుడికి వాల్మీకినాయక సంఘం సన్మానం



పురసభ కార్యాలయంలో సత్కారం

విజయపుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పురసభకు నూతన అధ్యక్షురాలైన భవ్య మహేశ్, ఉపాధ్యక్షులు తాజున్నీస్ మహబూబ్‌పాషాలను పట్టణానికి చెందిన మహర్షి వాల్మీకి నాయకసంఘం ఆధ్వర్యంలో పురసభ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా పురసభ సభ్యులు నందకుమార్, కవితాలను అభినందించారు. వాల్మీకి నాయకసంఘం గౌరవాధ్యక్షుడు నారాయణస్వామి, అధ్యక్షుడు మటన్ శ్రీరామణ్ణ, ఉపాధ్యక్షుడు ఓంశక్తి మునికృష్ణప్ప, కోశాధికారి తర్కారి మునిరాజణ్ణ, సంఘం కార్యదర్శి పాండురంగ, డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్వీన్స్‌రోడ్డులో అగ్నిప్రమాదం



కాలిపోయిన వాహనాలు

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శివాజినగర్ క్వీన్స్‌రోడ్డులోని తూర్పు విభాగం డీసీపీ కార్యాలయం ఎదురుగా ఖాళీస్థలంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి 3 లారీలు పూర్తిగా కాలిపోయాయి. ఖాళీస్థలం కావడంతో లారీలను అక్కడ పార్కింగ్ చేశారు. మంటలు చెలరేగిన వెంటనే పోలీసులు స్పందించారు. అగ్నిమాపక యంత్రాలను రప్పించి మంటలను ఆర్పించారు. శివాజినగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మూడు లారీలతోపాటు పలు వాహనాలు కాలిపోయాయి.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు..!

- అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- మూడేళ్లుగా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు



నిమ్మలకుంట అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లోనే నేటికీ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలు మంజూరైన వాటి నిర్మాణంలో జాప్యం చేయడంతో ప్రస్తుతం అవి పిల్లర్లకు, మొండిగోడలుగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఈ భవన నిర్మాణాలు పంచాయతీ రాజ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో ఉపాధి నిధులతో గత ప్రభుత్వంలో భూమి పూజ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించక కేంద్రాల నిర్మాణ పనులు ముందుకు సాగక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. సొంత భవనాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దెభవనాల్లో అరకొర సదుపాయాలతో, అపరిశుభ్రత నడుమ నడుస్తున్నాయని పలువురు గ్రామస్థులు అంటున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నేలకోటతండాలో పిల్లర్లకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం

ఎన్నికేంద్రాలు ఉన్నాయంటే..: ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలో 230 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్లు ఆశాఖ అధికారులు తెలిపారు. రూరల్‌పరిధిలో 95 కేంద్రాలు, అర్బన్ పరిధిలో 135 ఉన్నాయని తెలిపారు. రూరల్‌లో 29 కేంద్రాలకు మాత్రమే శాశ్వత భవనాలు ఉన్నాయన్నారు. మిగిలినవి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో అద్దె భవనానికి గ్రామీణ ప్రాంతంలో రూ.2వేలు, పట్టణ ప్రాంతంలో రూ.6వేలు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

అద్దెభవనాల్లో అగచాట్లు: అంగన్‌వాడీ కేంద్రాలను అద్దెభవనాల్లో నిర్వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు గగ్గోలు పెడుతున్నారు. సరైన సదుపాయాలులేక, ఇరుకు గదుల్లో, వంటగది లేక, అందులోనే చిన్నపిల్లలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారన్నారు. చాలా భవనాల వద్ద కనీసం మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలు మల మూత్రవిసర్జన చేస్తే టీచర్లు, ఆయాలు వెంటనే వారి తల్లులకు చెప్పి ఇంటికి పంపిస్తున్నట్లు ఆయా గ్రామాల మహిళలు చెబుతున్నారు.

ఈ ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా..?

గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాలు గోడలకు, పిల్లర్లకు పరిమితం కావడంతో ఈ ప్రభుత్వంలోనైనా వాటిని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. లక్షలు వెచ్చించిన నిర్మిస్తున్న భవనాలు అర్థంతరంగా ఆగిపోవడంతో నిధులు దుర్వినియోగం అయ్యాయని, వాటిని పూర్తిచేసి పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆఖరి మజిలీకి మెకానిక్ ఆసరా

- పేదల కోసం వైకుంఠ రథం ఏర్పాటు
- మన్ననలు పొందుతున్న కిషోర్

ముదిగుబ్బ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆయన ఒక సాధారణ ట్రాక్టర్ మెకానిక్. కానీ దాతృత్వంలో దొడ్డమనస్సు. రెండు సంవత్సరాలుగా మండల కేంద్రంలో వైకుంఠ రథం సేవలు ఉచితంగా అందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ కిషోర్ పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే మృతదేహాలను ఇంటి వద్ద నుంచి శ్మశాన వాటికకు తరలించేందుకు వైకుంఠ రథం కావాలని ఫోన్ చేసి తెలిపితే వెంటనే వాహనాన్ని ఏర్పాటు చేస్తారు. వాహనానికి అవసరమైన డీజిల్ ఖర్చును, వాహన డ్రైవర్‌కు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వాహనానికి ఎలాంటి రుసుము తీసుకోకుండా వైకుంఠ రథం సేవలు ఉచితంగా అందిస్తుండడంతో, ఖననం సమయంలో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఎందరో మెకానిక్ దాతృత్వాన్ని అభినందిస్తున్నారు.

ఇబ్బంది పడకూడదనే...

- మెకానిక్ కిషోర్, ముదిగుబ్బ

మనిషి మరణిస్తే శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు వైకుంఠ రథానికి వేలాది రూపాయలు పేద, మధ్య తరగతి వారు ఖర్చు చేయలేరు. కరోన సమయంలో మృతదేహాలను శ్మశాన వాటికలకు తీసుకెళ్లేందుకు వేల రూపాయలు తీసుకోవడం కళ్లారా చూశాను. ఆఖరి మజిలీకి పడుతున్న ఇబ్బందులు చూసి మనసు చలించింది. తనవంతుగా సేవాభావంతో ఉచిత వైకుంఠ రథం ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందట అమలులోకి తీసుకొచ్చాను. ఇప్పటి వరకు 191 మంది మృతదేహాలను ఖననాకి తరలించాం. ఎవరు ఫోన్ చేసినా వైకుంఠ రథాన్ని పంపుతున్నాను. సెల్ నెంబర్:9985976579, 789305997కు సంప్రదిస్తే వైకుంఠ రథాన్ని వెంటనే పంపుతాం.





◄ వైకుంఠ రథం కిషోర్ ►



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.02	1,579.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,116	881
నీటి నిల్వ (టీఎంసీలు)	8.01	4.38

నేలకొరిగిన పంటలు

కంప్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు రైతును నట్టేట ముంచాయి. తాలుకా పరిధిలోని రామసాగరం, సన్నాపురం, ఇటిగి, ముద్దాపురం, సూగూరు, బెలుగోడుహాళ్ తదితర గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంటలు ఇలా నాశనమవుతున్నాయని టంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణస్వామి క్యాంపు వద్ద వరి పంటలు గాలివానకు నేలకు ఒరిగాయి. అకాల వర్షంతో పాటు పంటను కట్టించేందుకు కూలీలు కూడా ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యం గొప్ప వరం



మాట్లాడుతున్న వైద్యాధికారి టీజీ విఠల్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు టీ.జి.విఠల్ అన్నారు.ఆరోగ్య సేవలను అందించే సంస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్‌గా ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లో గైనకాలజిస్ట్ డాక్టర్ రుక్ సురభన్ మాట్లాడుతూ గర్భిణులు జాగ్రత్త పాటిస్తే మాతాశిశు మరణాలను తగ్గించ వచ్చన్నారు. కార్యక్రమంలో 100మంది గర్భిణులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు అందించారు. ఈకార్యక్రమంలో అధికారి బసవరాజ్, శ్రీయతి సుజాతపురాణిక్, గోపాల్ వర్మ, ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

బళ్లారిలో చిరు జల్లులు


మోకా సమీపంలో కురుస్తున్న వర్షం

బళ్లారి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం సాయంత్రం గంటపాటు కురిసిన వర్షానికి నగరం చల్లబడింది. వారం రోజులుగా మండుతున్న ఎండలతో ప్రజలు విలవిలలాడారు. అయితే రెండు రోజులుగా వర్షాలతో జనం ఉపశమనం పొందారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా


ఊరేగింపును ప్రారంభిస్తున్న మేయర్ నందీష్

జగ్జీవన్‌రామ్ ఆలోచనలు ఆదర్శప్రాయం: కలెక్టర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): హరిత విప్లవానికి మార్గదర్శకుడు, జాతీయ నాయకుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆలోచనలు అన్ని కాలాలకు ఆదర్శనీయమని, ఆయన వ్యక్తిత్వం జీవిత గాథను యువతరానికి పరిచయం చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిర వేదిక హాల్లో నిర్వహించిన హరిత విప్లవ పితామహుడు భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ , అణగారిన వర్గాలకు ఆశాకిరణం అని ఆయన అన్నారు. పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ మేము ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న బాబు జగ్జీవర్‌రామ్ జయంతిని జరుపుకుంటామన్నారు. నగరంలో వివిద కళాబృందాలచే బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు.


డీఎస్ఎస్ మహిళా సంఘం ఆధ్వర్యంలో..

జిల్లాస్థాయి హరిత విప్లవ పోటీలు

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లాపరిపాలన, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ సరళాదేవి డిగ్రీ కాళాశాలలో 'హరిత విప్లవం' పై జిల్లాస్థాయి వ్యాసరచన , ప్రసంగ పోటీని నిర్వహించారు. పోటీల్లో సరళాదేవి కళాశాల విద్యార్థులు శ్రీదేవి, హులిగెమ్మ, మునీర్ భాషా వరుసగా మెదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించారు. ప్రసంగ పోటీలో శకుంతల, రంజిత, మేఘ వరుసగా మొదటి, రెండవ, మూడవ స్థానాలను సాధించారు.

డీఎస్ఎస్ మహిళా సంఘం ఆధ్వర్యంలో..

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను డీఎస్ఎస్ మహిళా సంఘం డీఎస్ఎస్ అధ్యక్షురాలు ఎం శాంత జిల్లా అధ్యక్షురాలు హెచ్ చంద్రకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షురాలు డాక్టర్ వై గౌసియాబీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప, సుజాత మంజుళ, కార్యదర్శులు ఉమాదేవి పాల్గొన్నారు.

కుడితినిలో

కంప్లి: కుడితినిలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవిందప్ప, కెంచప్ప, హనుమంతు, జయరాం, వెంకటేష్, రమేష్, తాయప్ప, యువ నాయకుడు మల్లికార్జున విశ్వస్వామి కిరణ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప: దేశం భవిష్యత్తు కోసం మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీఎం సతీష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం సిరుగుప్ప పట్టణం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన నామఫలకానికి పూలమాలలు వేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్, మల్లికార్జున, తాలుకా పంచాయతీ ఈవోపవన్‌కుమార్, నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, కౌన్సిలర్లు దళిత నాయకులు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు: జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ మరియు సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ 118వ జన్మదినోత్సవాన్ని ఆచరించారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ సర్కిల్‌లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి సమాజ ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాధికారి నీతీశ్, ఎస్పీ పుట్ట మాదయ్య, సాంఘిక సంక్షేమ శాఖ సబ్ డైరెక్టర్, రాయచూరు మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మోహపాత్ర , ఎస్సీ కులాల సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నార.


కుడితినిలో..


సిరుగుప్పలో..


రాయచూరులో..

క్రీడలతో మానసికోల్లాసం: మేయర్


మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీష్

బళ్లారి గాంధీనగర్/సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం అవసరమని, ముఖ్యంగా నిత్యం పని ఒత్తిడితో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని మేయర్ ముల్లంగి నందీష్ అన్నారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, యువ సబలీకరణ, క్రీడా శాఖ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో భోజనం ఆలస్యమైనా పర్వాలేదు గాని ఐదు క్షణాలు మొబైల్ చేతిలో లేకపోతే... ఉక్కిరిబిక్కిరి అయ్యేంత స్థితిలో అందరూ దాసోహం అయ్యారన్నారు. మొబైల్ ఫోన్‌ను దూరంగా ఉంచుకుని మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఇదే సందర్భంలో జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్ సుమైర్ ఉద్యోగుల చేత క్రీడా ప్రతిజ్ఞను చేయించి మాట్లాడుతూ మానసిక, ఉత్తమ ఆరోగ్యం కోసం క్రీడాపోటీలు ఎంతో ఉపయుక్తం అవుతాయని, అనంతరం జిల్లా సహాయాధికారి మహ్మద్ జుబేర్ మాట్లాడుతూ డబ్బుతో ఆరోగ్యాన్ని కొనలేమని, మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే క్రీడలు, సాంస్కృతిక కార్యాక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అబకారి శాఖ అసిస్టెంట్ కమీషనర్ మంజునాథ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రెడ్డి రమేష్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ్యుల సంగం ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ. ఆసీఫ్, యువ సబలీకరణ క్రీడా శాఖ అసిస్టెంటెంట్ డైరెక్టర్ కె.గ్రేసి, జాయింట్ కార్యదర్శి ఎన్.రమేష్‌లతో పాటు జిల్లా పరిధిలోని వివిధ తాలూకాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.


నారాయణస్వామి క్యాంపు వద్ద ముస్తాబైన కోదండ రామస్వామి ఆలయం

కల్యాణం చూతము రారండి..

● శ్రీరామనవమి సందర్భంగా ముస్తాబైన ఆలయాలు

కంప్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా రాములవారి కల్యాణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. తాలుకా పరిధిలో పలు గ్రామాల్లో క్యాంపులో ఆలయాలకు రంగులు వేసుకుని తోరణాలు కట్టారు. క్యాంపు బసవేశ్వర క్యాంపు గోపాలపురం శంకర్ సింగ్ క్యాంపు, నారాయణ స్వామి క్యాంపు ముద్దాపురం గ్రామాల్లో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు.

లైంగిక వేధింపుల నివారణకే 'మిషన్ శక్తి'



సదస్సులో మాట్లాడుతున్న వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నివారించడానికి, అంతర్గత కమిటీ ఏర్పాటు గురించి అవగాహన కల్పించడానికే మిషన్ శక్తి ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. శనివారం బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమల మండలిని సందర్శించి ప్రాజెక్ట్ గురించి సమచారాన్ని అందించారు. మిషన్ శక్తి ప్రాజెక్ట్ సమన్వయకర్త షాజహన్, సహాయకులు అర్చన మాట్లాడుతూ సుప్రీంకోర్టు జాతీయ మహిళా కమిషన్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం మిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో సమచారాన్ని ఆప్‌లోడ్ చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లావాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, మల్లికార్జునగౌడ, విషన్ శక్తి ప్రాజెక్ట్ అధికారులతో అదికారులతో మాట్లాడి జిల్లాలోని పరిశ్రమలు ,వ్యవస్థాపకులకు సమాచారాన్ని అందించడం ద్వారా అవగాహన పెంచుతామన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఐడీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అభయ్ దివాకర్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏఐటీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యరాలు అభయ్ దివాకర్ అన్నారు. శనివారం నగరంలోని రాఘవ కళా మందిరంలో ఏర్పాటు చేసిన వికాస శిబిరంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప విప్లవకారులు భగత్‌సింగ్ , నేతాజీ అన్నారు. దోపిడీ లేని సోషలిస్ట్ భారతదేశం గురించి వారు కలలు కన్నారన్నారు. నేటికీ దేశంలో విద్య , ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణ కారణంగా దూరమవుతున్నాయన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న, జిల్లాకార్యదర్శి కంబలి మంజునాథ్,ఉపాధ్యక్షురాలు శాంతి, ఉమ, నిహారిక, సమీర్, కాంతేశ్, మోహన్. నికిత, భవిత, భువనేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు

కంప్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక ప్రసిద్ది చెందిన గంగావతి సమీపంలోని ఆనేగొంది నవ బృందావనంలో శనివారం కవీంద్ర తీర్థ పూర్వారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రాలయ పీఠాధిపతులు 1008 సుబుదేంద్ర తీర్థప్రసాదులు దివ్యసన్నిధిలో కవీంద్ర తీర్థ పూర్వ పూజను అత్యంత వైభవంగా ప్రదర్శనగా నిర్వహించారు. పూర్వారాధనకు బృందావనాలు నిర్మల్యవిసర్జన, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, వెండి కవచాలంకరణతో పాటు పట్టు వస్త్రాలంకరణ, హస్తోదక అలంకారం, బ్రాహ్మణ సంతర్పణ, తీర్థప్రసాదం, అష్టోత్తర పారాయణం తదితర పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పండితులు, ద్వారకానాథ్ ఆచారి, హనుమేష్ ఆచారి, పావనభాను, పద్మావత్ ఆచార్య, హోస్పేట, గంగావతి, మఠాధిపతి సుశీలేంద్ర ఆచారి, గుంజల్లి మురళీ ఆచారి, శ్యామాచారి, ఇడపనూరు సంజీవ కులకర్ణి, గంగావతి మేనేజర్ సామవేద హాజరయ్యారు.


పూజలు నిర్వహిస్తున్న సుబుదేంద్ర తీర్థ స్వాములు

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం


నిజాముద్దీన్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ గుర్రప్ప తదితరులు

సిరుగుప్ప, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సయ్యద్ నిజాముద్దీన్ సేవలు అమోఘమని విద్యాశాఖ అధికారి గుర్రప్ప అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణం ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సయ్యద్ నిజాం బదిలీ అయ్యారు. 21 సంవత్సరాల పాటు ఉర్దూ పాఠశాలలో సేవలు నిర్వహించారు. ఆయన బదిలీ కావడంతో పట్టణ ప్రముఖులు, విద్యార్థులు ఆయన సేవలను కొనియాడారు. పలువురు ఆయన్ని ఘనంగా సత్కరించి అభినందించారు.

హోసూరు జోన్

మంగళముఖీలకు వైద్యకేంద్రం ప్రారంభం


ట్రాన్స్‌జెండర్ల వైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

కృష్ణగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మంగళముఖీల కోసం కృష్ణగిరిలో బహుళ విభాగ వైద్య కేంద్రాన్ని, పిల్లలకోసం పోషకాహార పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు అన్ని ప్రత్యేక వైద్యసేవలు ఒకేచోట లభించనున్నాయన్నారు. ఓపీడీ, ఇన్‌పేషంట్ విభాగం, హార్మోన్ థెరపీ, సైకియాట్రిక్ ట్రీట్‌మెంట్, ఎండోక్రినాలజీ ట్రీట్‌మెంట్, కిడ్నీ సర్జరీ, డెర్మటాలజీ, ప్రసూతి, గైనకాలజీ తదితర వంటి సేవలు లభిస్తాయన్నారు. కాగా పోషకాహార లోపంతో ఉన్నవారికి వీలుగా పునరావాస కేంద్రం ఇక్కడే ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పూవతి, మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖరన్, డిప్యూటి ప్రిన్సిపాల్ సాత్విక, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌లు సెల్వరాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.



పండ్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

బాటసారులకు పుచ్చకాయలు, మజ్జిగ పంపిణీ

హోసూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో దాహార్తి తీర్చేలా హోసూరు రైల్వే స్టేషన్ సమీపాన ప్రత్యేకంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. మేయర్ సత్యతో కలసి మంచినీరు, దోసకాయ, పుచ్చకాయ, మజ్జిగ ఇతరత్రా పంపిణీ చేశారు. రద్దీ ప్రదేశాలలో డీఎంకే నేతృత్వంలో అవసరమైన చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, మునీశ్వరనగర్, ఉజవ మార్కెట్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఎంకే జిల్లా కోశాధికారి సుకుమారన్, కార్యవర్గ సభ్యుడు ఎల్లో రమణి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఆరోగ్య స్థాయి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్, పన్నుల స్థాయి సమితి అధ్యక్షుడు చన్నరీప్ప పాల్గొన్నారు.

సర్క్యూట్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం

హోసూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో కాళీ కాంబాల్ కామతీశ్వరర్ ఆలయం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన సర్క్యూట్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కృష్ణగిరి అసిస్టెంట్ కమిషనర్ రాముయేల్ పాల్గొన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ధర్మకర్తల కమిటీ సభ్యులు విజయకుమార్, డెంకణీకోట ఇన్‌స్పెక్టర్ వెల్‌రాజ్, అంచెట్టి ఇన్‌స్పెక్టర్ అరుశ్‌మణి, పోచంపల్లి ఇన్‌స్పెక్టర్ రామమూర్తి, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరగధారి నృత్యం



బాగలూరులో కరగ ఉత్సవం

హోసూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాగలూరులోని కొత్త మరియమ్మన్ ఆలయ రథోత్సవంలో భాగంగా కరగ ఉత్సవం సంబరంగా జరిగింది. సూదపుర ప్రాంతంలో పల్లకీ, కరగ ఉత్సవం భక్తుల సందడి మధ్య సాగింది. ఆలయ పూజారి 48 కిలోల బరువున్న పూల కరగతో పురవీధులలో సాగాడు. ఉదయం 10 గంటలవరకు కరగ ఊరేగింపు జరిగింది. ఇళ్ల ముంగిట కరగను ఘనంగా స్వాగతించారు.

నేడు రామాలయాలను సందర్శించనున్న మంత్రి

ధర్మవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం పట్టణంలోని పలు రామాలయాలను సందర్శించనున్నట్లు బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రాంనగర్, గీతానగర్, దిమ్మెల్‌సెంటర్, గొట్లూరులోని రామాలయాలను సందర్శిస్తారన్నారు. 4గంటలకు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో హాకీ పోటీలను ప్రారంభిస్తారన్నారు. సోమవారం బత్తలపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో ఉదయం 10గంటలకు వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. 8న మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ఎన్డీఏ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం, 3.30 నుంచి 5.00 గంటలకు అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.